
అక్రమార్కుల పాడి.. పాడా

పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) కొందరు అవినీతి అధికారులకు పాడి ఆవుగా మారింది. జగన్ హయాంలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కోసం పాడాను ఏర్పాటు చేశారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పాడాకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించారు. ఆ నిధులతో ఏం పనులు చేశారు, ఎంత ఖర్చు పెట్టారు అనేదంతా రహస్యం. ఎందుకంటే పాడా నిధుల మంజూరు, ఖర్చుపై ఎవరూ ఎలాంటి సమాచారం బయటికి చెప్పలేదు. అదేదో వైసీపీ నేతల సొంత ఇంటి లెక్కలు అన్నట్లుగా వ్యవహరించారు. వెరసి కొందరు వైసీపీ నేతలు నిధులను అడ్డగోలుగా భోంచేశారనే అభియోగాలు ఉన్నాయి.


విద్యుత్ లైన్లు పూర్తయినా 11 కేవీ విద్యుత్ లైను ఏర్పాటు కాని దృశ్యం

- నిధుల వినియోగంలో దుర్వినియోగం
- రూ.19.20 కోట్లతో విద్యుత్ పనులు
- అయినా తరచూ కరెంటు సరఫరాలో అంతరాయం
- చేసిన పనులకే చేసినట్లు కనికట్టు
- ఆర్‌డబ్ల్యూఎస్ సర్వీసు పేరిట వైసీపీ నేతలకు విద్యుత్ కనెక్షన్లు
- ఎస్పీడీసీఎల్ నిధులను బాగా వాడేసిన ఆ సారు



(కడప-ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రావడంతో పాడాలో నిధుల దుర్వినియోగంపై ఇప్పుడిప్పుడే బయట పడుతోంది. అయితే పాడాలో పాపాల పుట్ట పగలాలంటే విజిలెన్స్ లేదా సీఐడీలతో విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు. ఇక పాడా నిధులకు సంబంధించి నిధుల వినియోగంలో విద్యుత్ పనుల్లో భారీగా గోల్‌మాల్ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఎక్కడా లేనివిధంగా పులివెందుల నియోజకవర్గంలోనే పాడా నిధులతో విద్యుత్ పనులకు సంబంధించి అక్షరాలా రూ.19,20,63,306 ఖర్చు పెట్టారు. ఇంత సొమ్ము నిజంగా ఖర్చయింటే అర సెకను కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదంటారు. విద్యుత్ పనుల మెయింటెనెన్స్ ఎల్‌సీ తీసుకున్నప్పుడు, విద్యుత్ కోత అప్పుడు పైస్థాయి నుంచి వచ్చే కోతలు మినహాయిస్తే అరసెకను కూడా కరెంటు సరఫరా అంతరాయం ఉండదంటారు. అయితే జిల్లాలో అన్ని డివిజన్ల మాదిరిగానే పులివెందులలోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి పులివెందుల విద్యుత్ కోతల్లో టాప్‌గా ఉందంటే ఇంక అక్కడ ఖర్చు పెట్టిన రూ.19 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయనేదే బేతాళప్రశ్న.

విద్యుత్ పనులకు రూ.19.20 కోట్లు

జగన్‌హయాంలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కోసం పాడా ఆధ్వర్యంలో వివిధ పద్దుల ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టారు. ఇక ట్రాన్స్‌కోకు సంబంధించి పులివెందుల, వేముల, చక్రాయపేట, సింహాద్రిపురం, వేంపల్లె, తొండూరు మండలాల్లో వివిధ పనులకు గాను రూ.19,20,63,306లు ఖర్చు పెట్టారు. వీటిలో ఎక్కువ శాతం గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం, విద్యుత్‌లైను షిఫ్టింగ్, ఇతరత్రా పనులు చేపట్టారు.

అంతా మాయ

పాడా నిధులతో చేపట్టిన విద్యుత్ పనుల్లో పెద్ద మాయాజాలమే చోటు చేసుకుందని చెబుతున్నారు. పులివెందుల నియోజకవర్గంలో తిష్టవేసిన ఓ అధికారి వైసీపీ నేతలతో కలిసి పాడాను పాడి ఆవుగా మార్చుకుని డబ్బులను పాలు పితికినట్లు పితుక్కున్నాడని చెబుతారు. మాకు సగం మీకు సగం అన్నట్లుగా వైసీపీ ముఖ్య నేతలకు కొన్ని పనులు ఆ అధికారి తన బినామీ ద్వారా చేపట్టగా, మరికొన్నింటిని వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులు చేపట్టారంటారు. 53 విద్యుత్ టవర్ల పనులను వివేకా హత్య కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులు చేశారని చెబుతారు. పులివెందుల నియోజకవర్గంలో జరిగిన పనుల్లో సాగానికి పైగా పనులు చేయకుండానే చేసినట్లు రికార్డులు సృష్టించి బిల్లులు కొట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. రెండురోజుల క్రితం పులివెందుల టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, ఇతరులు విద్యుత్ పనుల్లో అక్రమాలపై విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేశారంటే ఇక్కడ అవినీతి భాగోతం ఏ మేర సాగిందో అర్థమవుతుంది.

సంస్థకు అలా బొక్క పెట్టేశారు

ఏ ఉద్యోగి అయినా పనిచేసే సంస్థను తల్లిగా భావిస్తారు. అయితే ఆ సంస్థకే ఆ అధికారి సున్నం పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఏ ప్రభుత్వశాఖ అయినా విద్యుత్ సర్వీసు కానీ, లైన్లు వేయాలన్నా ట్రాన్స్‌కో ఎస్టిమేట్ వేస్తారు.ఆ డబ్బును చెల్లిస్తే వర్క్‌ఆర్డరు వేస్తారు. తరువాత పనులు చేస్తారు. అయితే పులివెందుల నియోజకవర్గంలో మాత్రం అంతా విరుద్ధంగా జరిగినట్లు చెబుతారు. ముఖ్యంగా 11కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటు, గృహ, వాణిజ్య సముదాయాలకు లేఅవుట్లలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంలో భారీ గోల్‌మాల్ జరిగినట్లు చెబుతారు. 11కేవీ లైను కావాలంటే ప్రైవేటు వ్యక్తులకైనా అందుకయ్యే ఖర్చును చెల్లించాల్సి ఉంది. అయితే పులివెందుల నియోజకవర్గంలో మాత్రం ఆ అధికారి చాలా తెలివిగా వ్యవహరించినట్లు చెబుతారు. ఉదాహరణకు పులివెందుల రింగురోడ్డులోని ఓ వెంచరుకు 11కేవీ లైను ఇవ్వాల్సి ఉంటే ఆ దూరాన్ని బట్టి ఆ వెంచరు యజమానులు డబ్బులు చెల్లించాలి. అయితే ఈ సారు ప్రత్యేక ఐడియాతో ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం అంటే అక్కడ నీటి పథకం కోసం కనెక్షన్ అంటూ 11 కేవీ లైన్‌ను చూపించి కావాల్సిన వారికి లైను ఇప్పించినట్లు చెబుతారు. చిన్న చితక అన్ని పనులు కలుపుకుని 488 పనులు చేస్తే సుమారు 80కి పైగా ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ పేరిట ఎస్టిమేట్ వేయడం విమర్శలకు బలం చేకూరుస్తోంది. గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే 30 మీటర్లలోపు ఉంటేనే సర్వీసు కనెక్షన్ ఇస్తారు. అంతకన్నా ఎక్కువ ఉంటే స్తంభం ఏర్పాటు చేయాలి. ఇందుకు గాను స్తంభం, విద్యుత్‌లైనుకు రూ.35వేలు చెల్లిస్తేనే కనెక్షన్ ఇస్తారు. అయితే ఇక్కడ పొలిటికల్ నేతల సిఫారసు పేరుతో ఇలాంటి సర్వీసులు ఇచ్చేసి సంస్థకు నష్టం చేకూర్చారంటారు. అసలు కొన్ని విద్యుత్ లైను పనులు చేయకుండానే చేసినట్లు చూపి భారీగా వెనకేసుకున్నట్లు చెబుతారు.

విజిలెన్స్ దృష్టి పెడితే..

పాడా నిధులతో చేపట్టిన విద్యుత్ పనుల్లో అక్రమాలు గుట్టు రట్టు తేల్చాలంటే విజిలెన్స్ లేదా సీఐడీతో విచారణ జరిపించాలని చెబుతున్నారు. రూ.19.20 కోట్లు ఖర్చు పెట్టినా కూడా అక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయం షరామామూలుగానే ఉంది. ఉమ్మడి జిల్లాలో కడప, మైదుకూరు, పులివెందుల, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయచోటి సబ్ డివిజన్ కార్యాలయాలున్నాయి. అక్కడ మాదిరిగానే పులివెందుల డివిజన్‌లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంది. కొన్నిమార్లు ఇంకా ఎక్కువగానే ఉంది. అయితే ఇక్కడి ఆ సారుకు తిరుపతిలో ఎస్పీడీసీ అధికారులతో మంచి సంబంధాలు ఉండడంతో అవినీతి గుట్టు రట్టు కాకుండా పులివెందులలో జరిగే విద్యుత్ పనులపై విచారణ లేకుండా సాగిస్తు వస్తున్నారని చెబుతారు. కూటమి ప్రభుత్వం వచ్చింది. మరి ఇప్పుడైనా పాడా నిధులపై విజిలెన్స్ లేదా సీఐడీతో విచారణ చేయిస్తే భారీగా అక్రమాల గుట్టు రట్టవుతుందని పలువురు టీడీపీ నేతలు, పులివెందుల ప్రజలు కోరుతున్నారు.

గండి క్షేత్రం జనసంద్రం


గండి క్షేత్రంలో పూజలందుకుంటున్న అంజన్న

చక్రాయపేట, ఆగస్టు 10: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రం జనసంద్రం అయింది. మొదటి శ్రావణ శనివారం గండిలో ఎటుచూసినా భక్తజన సందోహం కనిపించింది. కనీవినీ ఎరుగని రీతిలో మొదటి వారంలో గండికి భక్తులు చేరుకున్నారు. దాదాపు 70వేల మంది దాకా ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. భక్తులు ఉదయంనుంచే ఆలయానికి బారులు తీరారు. వచ్చిన భక్తులకు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజా రమేశ్ మూలవిరాట్‌ను తోమాలలతో అలంకరించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. సర్వ దర్శనానికి దాదాపు 3 గంటలు సమయం పట్టింది. అంతకు మించి రూ.100 దర్శనానికి బారులు తీరారు. రూ.50 దర్శనం చెప్పాల్సిన అవసరం లేదు. లడ్డు కౌంటర్ వద్ద తోపులాట జరిగింది. ఊహించని విధంగా భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో అధికారులు సైతం గాబరాపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ గోవింద రెడ్డి, ఎస్ఐ రంగనాథ్, చక్రాయపేట ఎస్ఐ వినోద్‌కుమార్‌లు చర్యలు తీసుకున్నారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం తలెత్తడంతో పోలీసులు సరిదిద్దారు. కాగా.. శ్రావణమాసం సందర్భంగా గండిలో డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని డీఎంహెచ్‌ఓ నాగరాజు పరిశీలించారు. ఇక్కడ భక్తులకు బీపీ చెకప్ తదితర పరీక్షలు నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు.


అంజన్న దర్శనం కోసం వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు

ప్రముఖ నాటక రచయిత
పల్లేటి లక్ష్మీకులశేఖర్ మృతి



రాయచోటి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం గడికోట కోటకాడపల్లెలో ఈయన 1954 డిసెంబర్ 3న పల్లేటి మరియమ్మ, విలియమ్స్ దంపతులకు జన్మించారు. తన 15వ ఏటనే రచనా ప్రస్థానాన్ని మొదలు పెట్టి 70 పౌరాణిక నాటకాలు, 40 సాంఘిక నాటకాలు, నాటికలు, 10 నృత్యనాటికలు, 250 వరకు ఆకాశవాణి నాటికలు, నాటకాలు, 8 దూరదర్శన్ నాటకాలు, నాటికలు రాశారు. ఉత్తమ రచయితగా.. దర్శకునిగా 10 నంది అవార్డులు, రచనల ప్రదర్శనలో మరో 78 నంది బహుమతులు పొందారు. ఈయనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న హంస, ఉగాది పురస్కారాలు, ప్రపంచ తెలుగుమహాసభల్లో అఖండ సన్మానాలు దక్కాయి. అష్టాదశ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేసి ఎందరో ప్రముఖుల చేత సన్మానాలు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారినుంచి గరుడ అవార్డు అందుకున్నారు.

వీరు సాంఘిక, చారిత్రిక, పౌరాణిక నాటకాలతో పాటు నవలలూ రాశారు. వీరి నాటకాలు కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. మృగతృష్ణ, ఆదది, చలిదీర్చిన చితిమంటలు, సమరం, అమ్మ(ను) కావాలి నవలలు కూడా రాశారు. పల్నాటి యుద్ధం, విశ్వకవి వేమన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, యోగివీరబ్రహ్మం, తాళ్లపాక అన్నమాచార్య తదితర చారిత్రిక నాటకాలు సైతం రాశారు. ఈయన రాసిన నాటికలు, నాటకాలన్నీ సవేరా ఆర్ట్స్ (కడప), లలితకళాసమితి (కర్నూలు), గీతానాటకమండలి (రాజంపేట) తదితర నాటక సమాజాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించారు.

గుండెపోటుతో మృతి..

పల్లేటి లక్ష్మీకులశేఖర్ రైల్వేకోడూరులో స్థిరపడ్డారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు ముగ్గురికీ వివాహాలయ్యాయి. కుమారుడు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల అస్వస్థతగా ఉండటంతో కులశేఖర్‌ను గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ వైద్య చికిత్సలు చేయించారు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి ఆరోగ్యం బాగుందని చెప్పారు. దీంతో శుక్రవారం రాత్రి గుంటూరు నుంచి బస్సులో తిరుగు ప్రయాణంలో ఉండగా మార్గమధ్యంలో గుండెపోటు రావడంతో మృతిచెందారని ఆయన పెద్దకుమార్తె ఇందిర తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో ఆయన పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ప్రముఖ నాటక రచయిత అయిన పల్లేటి లక్ష్మీకులశేఖర్ మృతి నాటకరంగానికి తీరని లోటని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు సాంఘిక, పౌరాణిక నాటకాలు రాయగల ఏకైక ప్రతిభాశాలి అని కొనియాడారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ప్రొద్దుటూరుకు చెందిన జింకా సుబ్రమణ్యంతో పాటు కడపకు చెందిన మూల మల్లికార్జునరెడ్డి, తదితరులు నివాళి అర్పించారు.

పట్టాలు తప్పిన ఫైబర్‌నెట్

- వైసీపీ హయాంలో అడ్డగోలు నియామకాలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం
- ఫీల్డ్ విజిట్ పేరుతో దిద్దుబాటుకు చర్యలు

కడప(కలెక్టరేట్), ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి. ప్రపంచ సమాచారం క్షణాల్లో ప్రతి ఒక్కరికి అందాలి అనే లక్ష్యంతో విభజిత రాష్ట్రానికి చంద్రబాబు మొదటిసారి సీఎంగా ఉన్న సమయంలో ఏపీ ఫైబర్‌నెట్ ప్రారంభించారు. జగన్ సర్కారు వచ్చాక దీనిని జనానికి ఇంటర్నెట్ సేవలు అందించడానికి బదులు వైసీపీ కార్యకర్తలకు పునరావాసంగా మార్చుకున్నారు. ఫోన్ కొట్టు ఉద్యోగం పట్టు అన్నట్లుగా అడ్డగోలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలతో అవినీతి అక్రమాలకు తెగబడ్డారు. ఫైబర్‌నెట్ కేబుల్, ఇతర టెక్నీషియన్ వర్క్‌లకు సరిపడా సిబ్బంది ఉన్నా అంతకు రెట్టింపుగా సిబ్బందిని నియమించి నెలనెలా జీతాల పేరుతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. కడప, పులివెందులలో కూడా ఏపీ ఫైబర్‌నెట్ సేవల పేరుతో కోట్ల రూపాయలు దారిమళ్లాయని పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఏపీ ఫైబర్‌నెట్‌ను కాంట్రాక్ట్ పొందిన ఏజీఎం ఎంటర్ ప్రైజెస్ బిజినెస్ సంస్థ దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. శనివారం జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందిని కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయానికి పిలిపించి వారి నియామకాలు, పనితీరుపై ఫీల్డ్ విజిట్ మాటున ఫిల్టర్ చేసే చర్యలు చేపట్టారు.

చానెళ్ల గొంతు నొక్కే ప్రయత్నం

రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ ఫైబర్ నెట్‌లో జగన్ పాలనలో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందనే విమర్శలున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఇంటర్నెట్ వ్యవస్థను పూర్తిగా గుప్పిట్లో పెట్టుకుని ఏకపక్షంగా వ్యవహరించింది. ఫైబర్‌నెట్‌లో ప్రతిపక్ష చానళ్లంటూ కొన్ని చానళ్లకు రాజకీయ రంగు పులిమి ఐదేళ్ల వైసీపీ పాలనలో వాటి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. జిల్లాలో కూడా ఏపీ ఫైబర్‌నెట్‌లో, డిష్ కనెక్షన్ ఆపరేటర్లకు ఆంక్షలు విధించిన సంగతి విదితమే. వైసీపీ పెద్దల ఉద్దేశాలకు అనుగుణంగా ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా అధికారుల మొదలు, రాష్ట్ర స్థాయిలో సంస్థలో పనిచేసే యాజమాన్యం వరకు భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.


కడపలో ఫైబర్‌నెట్ సిబ్బందిని విచారిస్తున్న ఆ సంస్థ అధికారులు

సగంమందికి సిఫారసులే

జిల్లాలో ఏపీ ఫైబర్‌నెట్ సర్వీస్‌లో పాయింట్ ఆఫ్ పర్సన్స్(పాప్) ఇంజనీర్లుగా గత టీడీపీ పాలనలో 25-30 మంది ఉండేవారు. వీరందరు కూడా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకాలు పొంది రూ.18,500 నుంచి రూ.23 వేల వరకు బేసిక్ శాలరీతో పనిచేసే వారు. ఎక్కడ టెక్నికల్ సమస్యలు ఉన్నా, మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ఏపీ ఫైబర్‌నెట్ సర్వీసులను ప్రజలకు చేరువ చేయడంలో వీరందరూ కీలకంగా పనిచేసే వారు. కానీ జగన్ సర్కారు వచ్చిన తరువాత దీనిని వైసీపీ జేబు సంస్థగా మార్చుకున్నారు. ఏపీ ఫైబర్‌నెట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు అక్షయపాత్రగా మారిందని చెప్పవచ్చు. అనర్హులకు కూడా ఎమ్మెల్యే, ఎంపీల ఫోన్‌తోనే ఈ సంస్థలో ఉద్యోగాలిచ్చారనే విమర్శలున్నాయి. ఫైబర్‌నెట్‌లో పాతిక మంది చేసే పనికి అదనంగా మరో 50 మందిని నియమించారు. వీరిలో సగంమందికి పైగా సిఫారసులతో చేరిన వారే. విధుల్లో ఉన్నా లేకున్నా వారికి జీతబత్యాల పేరుతో పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నారని ఆ శాఖ సిబ్బందే పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఫైబర్‌నెట్ సర్వీసులో ఫైబర్ బండిల్స్ ఉపయోగించడం, టెక్నికల్ సర్వీసులకు పది రూపాయల పనికి వంద రూపాయల బిల్లులు రాసుకుని ఈ ఐదేళ్లలో జిల్లాలో కోట్లాదిరూపాయలు ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టారనే విమర్శలు ఆ సంస్థ ఉద్యోగుల నుంచే వస్తున్నాయి. కాగా శనివారం నిర్వహించిన నియామక పత్రాల వెరిఫికేషన్‌లో దాదాపు 60శాతం మందికి అపాయింట్మెంట్ లెటర్స్ లేవని తెలుస్తోంది. అంతే కాకుండా ఉద్యోగ నియామకాలు పొందితే అభ్యర్థుల పూర్తి డేటా విజయవాడలోని ఆ సంస్థ హెడ్ ఆఫీసులో ఉండాలి. కానీ రాజకీయ పలుకుడితో వచ్చిన వారి వివరాలు జిల్లా ఫైబర్ నెట్ కార్యాలయంలో కూడా లేవని తెలుస్తోంది. అడ్డగోలుగా ఉద్యోగాలు ఇచ్చి అవినీతికి పాల్పడ్డ ఆ మాయ సంస్థ గుట్టు రట్టవుతుందని తెలుసుకున్న యాజమాన్యం జిల్లాలో సిబ్బంది ఎక్కడెక్కడ పని చేస్తున్నారో? తెలుసుకునేందుకు అంటూనే ఉద్యోగుల ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్లను సేకరించడం చూస్తే పెద్ద కుంభకోణమే జరిగిందని చెప్పవచ్చు. ఇకపోతే.. గతంలో ఆ సంస్థలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న విజయవాడ, తిరుపతికి చెందిన ప్రతినిధులు, అవినీతికి ఆద్యుడిగీ చెబుతున్న జిల్లా మేనేజరు సర్టిఫికెట్లను సైతం పరిశీలించడం గమనార్హం. కాగా అడ్డగోలు నియామకాలు పొందిన కొందరు ఉద్యోగులు తమ ఉద్యోగాలు భద్రత కోసం టీడీపీ నాయకుల పంచన చేరి, ఉద్యోగాలు గ్యారంటీ అనే ధీమాలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఏపీఫైబర్‌నెట్‌లో జిల్లాలో వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లావాదేవీలు, జమ, ఖర్చులు ఉద్యోగ నియామకాలను ఆరా తీస్తే పెద్దఎత్తున అవినీతి పుట్ట పగలడం ఖాయం. ఈ విషయమై ఫీల్డ్ విజిట్‌కు వచ్చి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టిన ఏజీఎం మహేశ్, రీజనల్ కో-ఆర్డినేటర్ దివాకర్ రెడ్డిలను వివరణ కోరగా.. ఫీల్డ్ విజిట్‌కు వచ్చి పోతుంటామన్నారు. జిల్లాలో ఆ సంస్థపై వచ్చిన ఆరోపణలపై ప్రశ్నిస్తే ఇది విజయవాడ హెడ్ ఆఫీసులో తేల్చాల్సిన విషయమని దాటవేశారు.

అవుకు నుంచి కృష్ణాజలాలు విడుదల

- నేడు గండికోటలోకి చేరనున్న కృష్ణా నీళ్లు

జమ్మలమడుగు/కొండాపురం/మైదుకూరు రూరల్, ఆగస్టు 10: నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ నుంచి గండికోట ప్రాజెక్టుకు కృష్ణాజలాలను విడుదల చేశారు. శనివారం సాయంత్రం అవుకు రిజర్వాయర్ వద్ద కృష్ణమ్మకు పూజలు నిర్వహించి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌లు శాస్త్రోక్తంగా కృష్ణమ్మకు పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. 11,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేసినట్లు సీఈ మల్లికార్జునరెడ్డి తెలిపారు. జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా సుమారు 55 కిలోమీటర్లు ప్రయాణించి గండికోట సొరంగం ద్వారా ఆదివారం సాయంత్రానికి కృష్ణాజలాలు గండికోట ప్రాజెక్టులోకి చేరనున్నాయి.

కృష్ణజలాలకు హారతి పట్టి స్వాగతం..

మైదుకూరు మండలంలోకి ప్రవేశిస్తున్న కృష్ణాజలాలకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టర్ లోతేటి శివశంకర్ శనివారం ఎస్ఆర్-1 వద్ద హారతి పట్టి, చీర సారెతో స్వాగతం పలికారు. దువ్వూరు మండలంలోని చల్లబసాయపల్లె వద్ద నున్న ఎస్ఆర్-1 నుంచి ఎస్ఆర్-2 కు నీటిని వదిలారు. అనంతరం సీఎంపీ హెడ్ రెగ్యులేటర్ ద్వారా చింతకుంట, మైదుకూరు చెరువులకు బటన్ నొక్కి నీటిని వదిలారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ నీటి విడుదలపై హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం జరుగకుండా స్థానిక నిధుల నుంచి పది లక్షల రూపాయలు ఎమ్మెల్యే పుట్టా విడుదల చేశారని అన్నారు. అనంతరం మైదుకూరు పట్టణంలోని తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు.


నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్ వద్ద కృష్ణాజలాలకు పూజలు నిర్వహిస్తున్న జేసీ అదితిసింగ్


జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా గండికోట వైపు పరుగులు తీస్తున్న కృష్ణాజలాలు

వారు మారరు.. వీరు వినరు..!

- ఇష్టానుసారంగా మైనర్ల ర్యాష్ డ్రైవింగ్
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తల్లిదండ్రులు
- పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా.. కనిపించని మార్పు
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న యువత

వాళ్లది తెలిసీ తెలియని వయసు. అలాంటి వారికి బైకు దొరికితే అడ్డు అదుపు ఉండదు. సినిమా లెవల్లో ఫోజులు కొడుతూ.. ర్యాష్‌గా బైక్‌లు నడుపుతూ.. ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు అడగడం ఆలస్యం.. వారికి బైకు ఇస్తున్నారు. చిన్న చిన్న బండ్లు కాకుండా పెద్ద పెద్ద స్పోర్ట్స్ బైకులు తోలుతూ కనిపిస్తున్నారు. గతంలో మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ చేశారు. అయినా తల్లిదండ్రులు మారడం లేదు.. పిల్లలకు బైక్‌లు ఇస్తున్నారు. పిల్లలూ వినడం లేదు.. ర్యాష్‌డ్రైవింగ్‌తో అందరినీ భయపెడుతున్నారు.



కడప (క్రైం), ఆగస్టు 10: ఇంటర్మీడియట్, పదోతరగతి, 9వతరగతి చదువుతున్న పిల్లలు కూడా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలంటే 18 సంవత్సరాలు నిండాలి. లైసెన్స్ ఉన్న వారే వాహనాలు నడపాలి. ఇవీ నిబంధనలు. అయితే లైసెన్స్ కథ పక్కనబెడితే, 18 ఏళ్లు నిండని మైనర్లు రయ్.. రయ్ అంటూ ద్విచక్ర వాహనాలు నడిపేస్తున్నారు. వీరికి అవగాహన లేకపోవడం, బాధ్యత లేకపోవడంతో అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీరి వల్ల ఇతరులు కూడా ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది.

కళాశాలలకు కూడా బైకుల్లోనే..

కడపలో ఇటీవల ఇంటర్మీడియట్ విద్యార్థులు స్కూటీలు, పెద్ద బైకులపై కళాశాలలకు వెళుతూ కనిపిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు 15 నుంచి 17 సంవత్సరాలు ఉంటాయి. దీంతో కొన్ని కళాశాలల్లో ద్విచక్ర వాహనాలకు అనుమతులు లేవు. అలాంటి చోట, వీరు చుట్టుపక్కల పార్కింగ్ చేసి కాలేజీలకు వెళుతున్నారు. కొందరైతే నేరుగా కళాశాలల్లోకి బైకులను తీసుకెళుతున్నారు. స్కూటరుపై ముగ్గురు లేదా నలుగురితో కలిసి డ్రైవింగ్ చేస్తున్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే వీరితో పాటు ఎదురుగా వస్తున్న వారు కూడా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో కళాశాల వద్ద వాహన తనిఖీలు చేపట్టి బైకులు నడిపే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి వదిలేశారు. ప్రస్తుతం కూడా ఈ మైనర్లు ప్రధాన రహదారులే కాకుండా వీధుల్లో నడుపుకుంటూ వెళుతున్నారు. ఇంటర్ విద్యార్థులే కాకుండా 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సైతం బైకులు నడుపుతూ కనిపిస్తున్నారు. ఇలాంటి వారిపై పోలీసులు కాస్త కఠినంగా వ్యవహరిస్తే కొన్ని రోడ్డు ప్రమాదాలనైనా నివారించవచ్చని పలువురు అంటున్నారు. తనిఖీలు చేపట్టినప్పటికీ వీరు మరో మార్గం ద్వారా తప్పించుకుని పోతున్నారు. బైకులో ఒకరిద్దరే కాదు.. ఏకంగా ముగ్గురు, నలుగురు కూర్చుని వెళుతున్నారు. మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ఫోకస్ పెట్టినా పిల్లల తల్లిదండ్రుల్లో మాత్రం మార్పు రాకపోవడంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.


కడప ఆర్టీసీ బస్టాండు వద్ద ద్విచక్ర వాహనంలో త్రిబుల్ డ్రైవింగ్ చేస్తున్న మైనర్లు

పిల్లల పట్ల తల్లిదండ్రులు నిఘా ఉంచాలి

కొడుకు మారాం చేశాడని, కుమార్తె గారాబం చేస్తుందని వారికి బండ్లు చేతికిస్తే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్లే. పిల్లల పట్ల తల్లిదండ్రులకు బాధ్యత ఉండాలి. పోలీసుల తనిఖీల్లో మైనర్లు పట్టుబడితే వారిని తల్లిదండ్రులు మందలించాల్సింది పోయి గారాబం చేస్తూ మళ్లీ బండ్లు చేతికి ఇస్తున్నారు. కనీసం లైసెన్స్ పొందే వయసు లేని పిల్లలకు బైకులు ఇవ్వడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఆ ఇంట్లో విషాదం నిండాల్సిందే. ఏదిఏమైనా ద్విచక్రవాహనాల నడిపే విషయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులే తగిన బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది.


పైన పటారం.. లోన లొటారం

పైన పటారం.. లోన లొటారం అనే నానుడికి బద్వేలులోని ప్రభుత్వ సామాజిక వైద్యకేంద్రము అతికినట్టు సరిపోతుంది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి భవనాలు నిర్మించారు. అందంగా ఉండేలా రంగులేశారు. 50 పడకలు ఏర్పాటు చేశారు. కానీ పేద ప్రజలకు నాడిపట్టి వైద్యం చేసేందుకు తగినంత మంది వైద్యులను మాత్రం నియమించలేదు. దీంతో ఇక్కడ సరైన వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



- రూ.కోట్లతో ఆసుపత్రి నిర్మాణాలు
- కనీస సౌకర్యాలు శూన్యం
- గర్భకోశవ్యాధి నిపుణులు లేక మహిళల అవస్థలు
- చిన్నపిల్లల వైద్యులూ లేరు
- ఇదీ 50పడకల ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి


చిన్నపిల్లల వైద్యనిపుణులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న వెంటిలేటర్


మరమ్మతులకు నోచుకోని అల్ట్రాస్కానింగ్ మిషన్

బద్వేలు టౌన్, ఆగస్టు 10: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో 80వేలు, పంచాయతీ పరిధిలో 30వేల పైనే జనాభా ఉంది. వీరితో పాటు బద్వేలు ఆసుపత్రి పరిధిలో మరో 20 పంచాయతీలు ఉన్నాయి. ఈ ఆసుపత్రికి రోజూ 300 నుంచి 400మంది రోగులు వస్తుంటారు. అయితే వీరికి సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. బద్వేలు 50పడకల ఆసుపత్రిలో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యులు, గైనకాలజిస్టులు లేరు.

పరికరాలు ఉన్నా నిరుపయోగం

లక్షల రూపాయలు వెచ్చించి బద్వేలు ప్రభుత్వ వైద్యశాలలో 5 వెంటిలేటర్లు, 50 బెడ్లు ఏర్పాటు చేశారు. అయితే వెంటిలేటర్లను వినియోగించేందుకు ఆ విభాగం వైద్యులు లేకపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. అలాగే గర్భవతులకు అల్ట్రాస్కానింగ్ మిషన్ అందుబాటులో ఉన్నప్పటికీ గైనకాలజిస్టు లేరు. గర్భిణీ మహిళలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి ఆసుపత్రులకు వస్తే ఇక్కడ గైనకాలజిస్టు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి వైద్యులు అందుబాటులో ఉన్నా.. సంబంధిత పరికరాలు లేకపోవడంతో వచ్చిన రోగులకు పూర్తిస్థాయిలో చికిత్స చేయలేక మందులతో సరిపెడుతున్నారు. అలాగే కంటి వైద్యనిపుణులు బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం, శనివారం మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఈ విషయం తెలియక ఆసుపత్రికి వచ్చిన రోగులు వైద్యులు లేక వెనుదిరుగుతున్నారు. నియోజకవర్గంలోనే ఇది పెద్ద ఆసుపత్రిగా పేరు పొందినప్పటికీ వైద్యుల కొరత ఉండటంతో సరైన వైద్యసేవలు అందక ప్రైవేటు ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పేద ప్రజలు గత్యంతరం లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వీరికి వేల రూపాయలు ఖర్చు తప్పడం లేదు. ఇప్పటికైనా బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను ఏర్పాటుచేసి సరైన వైద్యసేవలు అందించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అన్నివేళలా సేవలు..



సిబ్బంది కొరత ఉన్నా.. అన్ని వేళలా సేవలు అందిస్తున్నాం. వైద్యుల కొరత ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా. వైద్యులను నియమిస్తే పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించవచ్చు. అత్యవసర కేసులకు 24గంటలు అందుబాటులో ఉంటాను. అవసరమైతే 9440980369 నెంబరుకు ఫోన్‌చేస్తే పది నిమిషాల్లో ఆసుపత్రికి వచ్చి సేవలు అందిస్తున్నా.

- డాక్టర్ రాంప్రసాద్, డిప్యూటీ సివిల్‌సర్జన్

మోటార్లు పగులకొట్టి రాగితీగ చోరీ


స్టార్టర్‌లో తీగను తీసుకెళ్లారని చూపిస్తున్నరైతు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు10: గురయ్యగారి పల్లెలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్లు పగులకొట్టి అందులో ఉన్న రాగితీగ అపహరించినట్లు రైతులు రెడ్డెయ్య, వెంకటసుబ్బయ్య, నరసింహులు, ఓబయ్య, వేణు తెలిపారు. ఒకేరోజు 6-7 మోటార్లు పగులకొట్టి, విద్యుత్ స్తంభం నుంచి తీసిన తీగను కాల్చి అందులో ఉన్న కాపర్‌ను అపహరించినట్లు రైతులు తెలిపారు. పంటలకు నీరు పారగట్టాలని వ్యవసాయ పంపుసెంట్ల వద్దకు వచ్చిన రైతులు చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ...

వీరపునాయునిపల్లె, ఆగస్టు 10: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె సంగాలపల్లె మార్గమధ్యలోని జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్నకాపర్ వైరు దాదాపు రూ.10వేల నుంచి రూ.20వేల దాకా విలువ చేస్తుందని రైతులు పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని బాధితరైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కడప (క్రైం), ఆగస్టు 10 : కడప నగరం అప్సర సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయని చిన్నచౌకు పోలీసులు తెలిపారు. కడప మాసాపేటకు చెందిన ఉమామహేశ్వర్‌రావు సొంత పని నిమిత్తం అప్సర వద్దకు వస్తుండగా దారిలో పెట్రోలు అయిపోయింది. దీంతో సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు బైకు తోసుకుంటూ వెళుతుండగా అప్సరా నుంచి కృష్ణసర్కిల్‌కు వెళుతున్న ఇంటర్ సెకండియర్ చదువుతున్న సుఖవనంరాజు కేటీయం బైకులో వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఉమామహేశ్వర్‌రావు కాలు విరిగి ఇంటర్ విద్యార్థి సుఖవనంరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇరువురిని రిమ్స్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం సుఖవనం రాజును కడపలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 10 : కడప నగరం తారకరామానగర్‌లో గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు తారకరామానగర్‌కు చెందిన క్రిష్ణవేణి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆమెను అరెస్టు చేసి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థులు తోడ్పాటునివ్వాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: మదనపల్లెలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటునివ్వాలని ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తొలిసారిగా పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ర్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అనుగుణంగా అన్ని డిగ్రీ కోర్సుల్లో మెరుగైన బోధనలు అందిస్తున్నామన్నారు. విద్యార్థి నులకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంలో పూర్వ విద్యార్థులు సహక రించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో 309 సీట్లు ఖాళీ

నూజివీడు టౌన్, ఆగస్టు 10: ఆర్జీయుకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొదటి, రెండు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికాగా 309 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మొత్తం నాలుగు క్యాంపస్‌లకు గాను 4 వేల ట్రిపుల్ ఐటీ సీట్లకు మరో 400లు సూపర్ న్యూమరీ సీట్లు కలిపి 4,400 సీట్లకు ఆర్జీయూకేటీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. నాలుగు క్యాంపస్‌ల మీద 753 సీట్లు మిగలగా రెండో విడత కౌన్సెలింగ్‌లో 444 సీట్లు భర్తీ అయ్యి 309 సీట్లు మిగిలాయి. వీటికి త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.

మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్‌లో 13 మంది ఎస్‌ఐల బదిలీలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 10: మదనపల్లె పోలీసు సబ్‌డివిజన్‌లోని 13 పోలీసేస్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూల్ రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లె వన్ టౌన్ ఎస్‌ఐ-1గా కడప డీఎస్‌బీలో పనిచేస్తున్న అన్సర్‌బాషాను, ఎస్‌ఐ-2గా వాల్మీకిపురం నుంచి బి.శ్రీనివాసులునాయక్‌ను బదిలీ చేశారు. అలాగే మదనపల్లె టు టౌన్ ఎస్‌ఐ-1గా కేవీపల్లె నుంచి ఎస్‌కే రహీముల్లా, ఎస్‌ఐ-2గా పి.కృష్ణమూర్తిని బదిలీ చేశారు. మదనపల్లె తాలూకా ఎస్‌ఐ-1గా హరిహరప్రసాద్, ఎస్‌ఐ-2 గా పి.వి.రమణను బదిలీ చేశారు. ముదివేడు ఎస్‌ఐగా పీలేరు నుంచి దిలీప్‌కుమార్‌ను, నిమ్మనపల్లె ఎస్‌ఐగా బైరెడ్డిపల్లె నుంచి బి.కృష్ణయ్యను, రామసముద్రం ఎస్‌ఐగా మదన పల్లె తాలూకా నుంచి రవికుమార్‌ను, ములకలచెరువు ఎస్‌ఐగా రాయచోటి దిశా నుంచి గాయత్రిని, తంబళ్లపల్లె ఎస్‌ఐగా నిమ్మనపల్లె నుంచి లోకేశ్‌రెడ్డి, పెద్దమండ్యం ఎస్‌ఐగా సోమల నుంచి కె.శివశంకరను, పీటీఎం ఎస్‌ఐగా పీలేరు నుంచి ఎంకె నరసింహులును బదిలీ చేశారు.

వ్యాపారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 10 : రామేశ్వరానికి చెందిన క్రిష్ణారెడ్డి (51) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. క్రిష్ణారెడ్డి రామేశ్వరంలో గదిని బాడుగకు తీసుకుని అగరవత్తుల చేస్తుండేవాడు. రోజులాగా వ్యాపారం చేసేందుకు వెళ్లాడు. అలా వెళ్లిన వాడు ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య అక్కడికి వెళ్లారు. కాగా అక్కడ ఉరివేసుకుని చనిపోయినట్లు గుర్తించారు. అప్పుల వల్లనే ఉరి వేసుకున్నట్లు ఫిర్యాదులో ఆమె తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి'

ములకలచెరువు, ఆగస్టు 10: అన్నమయ్య జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు తోపు కృష్ణప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం మండల కార్యదర్శి అంజనప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ బాధితుల సమస్యలపై ఈ నెల 12వతేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అన్యాక్రాంతమైన భూములను ప్రస్తుత ప్రభుత్వం స్వాధీనం చేసుకుని చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 25 ఎకరాలకు మించి ఉండకూడదని చట్టం చెబుతుంటే రాజకీయ నాయకులు వేలాది ఎకరాలు ఎలా సంపాదిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని లోహితారెడ్డి

కురబలకోట, ఆగస్టు 10: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన లోహితారెడ్డిని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం ఏఐ విభాగానికి చెందిన లోహితారెడ్డి ఎన్‌సీసీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలిపారు. కాగా ఎంపికైన విద్యార్థిని ఈ నెల 15న విజయవాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినిని కరస్పాండెంట్ ఎస్.విజయ భాస్కర్ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ అభినందించారు.

వీరభద్రస్వామికి 44 గ్రాముల బంగారు ఆభరణాల వితరణ


వీరభద్రస్వామికి బంగారు ఆభరణాలను వితరణ చేస్తున్న కన్నడ భక్తులు

రాయచోటిటౌన్, ఆగస్టు10: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి శనివారం కర్ణాటక రాష్ట్రం రాయచూరు వాసులు అనసూయ, హిరేమట్ కుటుంబ సభ్యులు రూ.3.23 లక్షల విలువ చేసే 44 గ్రాముల 920 మిల్లీగ్రాముల బరువు గల బంగారు మీసం, రెండు కళ్లను ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డికి అందజేశారు.

ఈ సందర్భంగా దాతలు అందజేసిన బంగారు నగలకు ఆలయ సిబ్బంది రసీదున ఇచ్చి, ఆలయ ఉప ప్రధాన అర్చకులు శంకరయ్య దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి పట్టువస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమమే ధ్యేయం


యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 : విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయుల సంక్షేమం యూటీఎఫ్ ధ్యేయమని ఆ సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శిపాలెం మహేశ్‌బాబు పేర్కొన్నారు. శనివారం కడప నగరంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా ఇదే వైఖరి కొనసాగిస్తుందన్నారు. గడిచిన 50 సంవత్సరాల్లో యూటీఎఫ్ సాధించిన విజయాలు నెమరువేసుకుంటూ ఆ నాటి నాయకుల త్యాగనిరతి, అంకితభావం, సంఘనిబద్ధతను సమాజశ్రేయస్సు కోసం వారు చేసిన కృషి స్మరించుకుని వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, కార్యదర్శులు పీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్,రూత్ ఆరోగ్యమేరీ, వీరనారాయణ,విజయచంద్రారెడ్డి, సుబ్బారావు, గురుమోహన్‌తో పాటు యూటీఎఫ్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వల్ప ఆధిక్యతలో కృష్ణా, వెస్ట్‌గోదావరి, విశాఖ జట్లు





అత్యధిక పరుగులు సాధించిన వరుణ్‌సాత్విక్ (147), యశ్వంత్ (132), ఖాజామొహిద్దీన్ (133), పరమ్‌వీర్‌సింగ్ (128)


6 వికెట్లు తీసిన రేవంత్‌నాగకుమార్

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 10: కడపలోజరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో రెండవరోజైన శనివారం తమ ప్రత్యర్థి జట్లపై కృష్ణా, వెస్ట్ గోదావరి, విశాఖపట్నం జట్లు స్వల్ప ఆధిక్యత సాధించాయి. వివారాలిలా.....

- నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప- కృష్ణా జట్ల మధ్యసాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి 77.1 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. తదుపరి బరిలోకి దిగిన కృష్ణా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో రెండవరోజైన శనివారం ఆట ముగిసే సమయానికి 105 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 335 పరుగుల భారీ స్కోర్ దిశగా సాగుతోంది. ఇందులో వరుణ్‌సాత్విక్ (బ్యాటర్) 147 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. మరో బ్యాటర్ ఖాజామొహిద్దీన్ 133 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. దీంతో ఇప్పటివరకూ కడప జట్టుపై 76 పరుగుల ఆధికత్యత దిశగా కృష్ణా జట్టు సాగుతోంది.
- నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం- వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74.4 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌట్ అయింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 80.1 ఓవర్లలో 243 పరుగులు చేసింది. కాగా బౌలింగ్ విభాగంలో వెస్ట్‌గోదావరి బౌలర్ రేవంత్ నాగకుమార్ 6 వికెట్లు పడగొట్టడం విశేషం. ఇదిలావుండగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 22 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. దీంతో ఇప్పటి వరకూ 54 పరుగుల ఆధికత్యలో వెస్ట్‌గోదావరి జట్టు ముందుకుసాగుతోంది. ఆదివారం ఆటకు చివరిరోజు.
- నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం మైదానంలో నెల్లూరు- విశాఖపట్నం జట్లమధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 85.2 ఓవర్లలో 331 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో విశాఖ బౌలర్ రచిత్ 5 వికెట్లు సాధించారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో రెండవ రోజైన శనివారం ఆట ముగిసే సమయానికి 89 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 381 పరుగులు చేసింది. ఇందులో యశ్వంత్ (బ్యాటర్) 132 పరుగులు చేయగా మరో బ్యాటర్ పరమ్‌వీర్‌సింగ్ 128 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

రాయచోటిలో పిచ్చికుక్క స్వైర విహారం

- వివిధ ప్రాంతాల్లో 30 మందిపై దాడి

రాయచోటిటౌన్, ఆగస్టు 10: రాయచోటిలో శనివారం ఓ పిచ్చికుక్క స్వైర్య విహారం చేసి 30 మందిపై దాడి చేసింది. వివిధ ప్రాంతాల్లో పిచ్చికుక్క తిరుగుతూ పలువురిపై దాడి చేయడంతో బాధితులంతా రాయచోటి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శని వారం ఉదయం 10, 11 గంటలకు రవిహాల్, ఠాణా, కొత్తపల్లి, బ్రాహ్మణవీధి, ఏరియా ఆస్పత్రి, కొత్తపేట, నేతాజీ సర్కిల్ తదితర ప్రాంతాల్లో సుమారు 30 మందిపై కుక్క దాడి చేసింది. పిచ్చికుక్క దాడి విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వాసు బాబు తన సిబ్బందితో పట్టణంలో కుక్క ఏప్రాంతంలో తిరుగుతుందో గుర్తించి కుక్కను పశువైద్యశాలకు తరలించి వ్యాక్సినేషన్ ఇప్పించారు. కాగా, కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించా లని రాయచోటి మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.




పిచ్చికుక్కదాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు

జీఓ 84ను రద్దు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న సాదిక్ అలీ

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 : మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన జీఓ నెం.84 రద్దు చేయాలని ఎస్టీయూ కడప నగర అధ్యక్షుడు సాదిక్ అలీ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 18 మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన శాఖలు జీఓ నెం.84ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తీర్మానం అందించారు. అలాగే మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు త్వరగా జరిగేలా చూడాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సీకేదిన్నె, ఆగస్టు 10: రక్తదానం ప్రాణదానంతో సమానమని సహస్ర ఫౌండేషన్ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మౌలాలి, సద్దాం, షరీఫ్, రఫీ, రెడ్డిబాష, పీరాన్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఎస్ఐకి ఘన సత్కారం



బదిలీపై వెళ్తున్న ఎస్ఐ
ధనుంజయుడిని సత్కరిస్తున్న పార్థసారథి

వేముల, ఆగస్టు 10: రెండున్నర సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎస్ఐ ధనుంజయుడుకు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి ఆధ్వర్యంలో శాలువ, పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా పార్థ మాట్లాడుతూ ఎస్ఐగా కాకుండా మండలవాసిగా పనిచేసి మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేశార న్నారు. ఆయన బదిలీపై వెళ్లడం బాధాకరమైనప్పటికి ఉద్యోగుల బదిలీలు తప్పనిసరి కాబట్టిఆయన ఎక్కడ ఉన్న ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 10 : కేరళ వరద బాధితులకు శనివారం విరాళాలు సేకరించినట్లు ఏపీ రైతు సంఘం కడప జిల్లాకార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 400 మందికి పైగా మృత్యువాత పడ్డారని, వందలాది మంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, మరికొంతమంది జాడ కూడా కానరావడంలేదని ఆయన పేర్కొన్నారు. బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. కేరళ వరద బాధితులకు అండగా నిలిచేందుకు కడప నగరంలో రైతు బజారు, లక్ష్మీరంగ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ప్రజల నుంచిరూ.4015 విరాళాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజలంతా ఇలాగే ఉదారంగా విరాళాలిచ్చి సంఘీభావం ప్రకటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పాఠశాల స్థాయి ప్రశ్నాపత్రాలతోనే ఎఫ్ఏ 1 నిర్వహించాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10:ఈనెల 24 నుండి జరగనున్న ఎఫ్ఏ1 పరీక్షలు పాఠశాలస్థాయి ప్రశ్నాపత్రాలతోనే నిర్వహించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగలరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థుల స్థాయినిబట్టి ప్రశ్నాపత్రంతయారు చేసే వధగావిద్యాశాఖాదికారులు అనుమతినివ్వాలని కోరారు. వాట్సప్ ప్రశ్నాపత్రాలకు స్వస్తి పలకాలని కోరారు. ముద్రణ ప్రశ్నాపత్రాలు సరఫరా చేయకపోవడం వల్ల గందరగోళం నెలకొందన్నారు. ఆగస్టు 17 నుంచి జరగనున్న స్కూలు కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు మెయింటెనెన్స్ ఫండ్ విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

'పేర్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 : విజయవాడ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న పేర్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఇందుకు కారకులైన వారిని అరెస్టు చేయాలంటూ కడప నగరం ఆర్టీసీ బస్టాండు అంబేడ్కర్ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. తొలగించిన స్థానంలోనే అదే పేర్లను తిరిగి చేర్చాలన్నారు.

కమలాపురంలో...

ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి శరత్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసినివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సీతారామ, లక్ష్మణ గ్రామోత్సవం





స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు... ఆహూతులను ఆకట్టుకున్న కోలాటం

వల్లూరు, ఆగస్టు 10 : మండల పరిధిలోని తప్పెట్ల గ్రామంలో జరుగుతున్న సీతారామ లక్ష్మణ హనుమత్ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రెండో రోజైన శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వాములకు పంచామృతాభిషేకం నిర్వహించారు.కోలాటాలు అలరించాయి. అలాగే గణపతి ఆదిత్యాది నవగ్రహ సీతారామలక్ష్మణ మృత్యుంజయ హోమం నిర్వహించారు.

అలాగే సాయంత్రం వేళ మహాస్నపనం నిర్వహించి వైభవంగా హోమాలు, పూజలు నిర్వహించారు.

వైష్ణవాలయాల్లో శ్రావణమాస పూజలు



పూజలందుకున్న వెంకటేశ్వరస్వామి

చెన్నూరు, ఆగస్టు 10 : శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా మండలంలోని వైష్ణవాలయాల్లో మూలవిరాట్ మూర్తులకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. చెన్నూరు ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలై అభిషేకాలు, పూజలు అలంకరణ నిర్వహించారు. విష్ణు సహస్రనామ సంకీర్తన చేశారు. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి దేవికి ఆంజనేయస్వామికి పూజలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను నిలిపి ఊరేగించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే బ్రాహ్మణవీధిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో చిన్నమాచుపల్లె, గుర్రంపాడు ఆంజనేయస్వామి ఆలయాల్లో బుడ్డాయపల్లె అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా శ్రావణమాస ఉత్సవాలు

సీకేదిన్నె, ఆగస్టు 10: చింతకొమ్మదిన్నె మండలంలో మొదటి శ్రావణశనివారం సందర్భంగా ఆంజనేయస్వామికి ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. అప్పరాజుపల్లె వద్ద వీరాంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. చెక్కభజన గురువు కొండయ్య బృందంచే భజన ఏర్పాటు చేసి భక్తులకు కనువిందు చేశారు. కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దు యజమానికి బహుమతిని అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

ఏపీ హంస పులివెందుల తాలూకా కార్యవర్గం ఏర్పాటు



ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీస్
అసోసియేషన్ పులివెందుల తాలూకా నూతన కార్యవర్గం

పులివెందుల రూరల్, ఆగస్టు 10: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ హంస) పులివెందుల తాలూకా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక పులివెందుల మిని సెక్రటేరియట్‌లోని ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజారత్నం, కార్యదర్శి చంద్రమౌళి, వైస్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన అధికారి నరేష్ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. పులివెందుల తాలూకా అధ్యక్షులుగా నరేష్, జనరల్ సెక్రటరీగా సతీష్‌కుమార్, ట్రెజరర్‌గా నాగ్లానాయక్‌లను ఎన్నుకున్నామన్నారు. అలాగే వైస్‌ప్రెసిడెంట్లుగా రాధ, కవిత, గురుప్రసాద్, హరిప్రసాద్, రమణయ్య, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాసరావు,రమణమ్మ, భాస్కర్, షెహాజ్ బేగం, అశ్వని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జ్యోతి, పబ్లిసిటీ ప్రెసిడెంట్ విశ్వనాథ్, ఉమెన్ జాయింట్ సెక్రటరీగా నాగమణిలను ఎన్నుకున్నామన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని నూతన అధ్యక్షుడు నరేష్ తెలిపారు.

మానవతా ఉచిత సేవ

వేంపల్లె, ఆగస్టు 10: మానవత స్వచ్ఛంద సంస్థ ఉచితంగా మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. గండి శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా గండికి వెళ్లే భక్తులకు వేంపల్లె, కుమ్మరాంపల్లె గ్రామాల మధ్య రోడ్డుపక్కన ఉచిత మినరల్ వాటర్‌ను శనివారం ఏర్పాటుచేయించారు. మానవత సంస్థ ప్రతినిధులు చక్రపాణిరెడ్డి, కావలి కృష్ణతేజ, చల్లా బాలాజిలు ఉచిత మినరల్ వాటర్ శిబిరాన్ని ప్రారంభించారు. శ్రావణ్, సుబ్బారెడ్డి, మణిగోపాల్‌రెడ్డి, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగండ్లూరు కాలనీలో ఉచిత వైద్య శిబిరం

కమలాపురం రూరల్, ఆగస్టు 10 : నగర పంచాయతీ పరిధిలోని తూర్పుగండ్లూరు కాలనీలో జ్వరాలు ప్రబలుతున్నాయని విషయం తెలుసుకున్న వైద్యసిబ్బంది శనివారం డాక్టర్ వీరేంద్రసింగ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. శుక్రవారం రాత్రి కొంత మంది చిన్నారులకు జ్వరం రావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యసిబ్బంది డెంగ్యూలక్షణాలు ఉన్నాయని తెలపడంతో మీడియా ద్వారా తెలుసున్న వైద్య సిబ్బంది అక్కడికి వెళ్లి వైద్యం అందించారు. భయపడాల్సిన అవసరం లేదని, సీజనల్ వ్యాధులేనని వారు తెలిపారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. డాక్టర్‌లు శిల్ప, సబ్ యూనిట్ ఆఫీసరు లక్ష్మయ్య, ఎన్‌వీ ప్రసాద్, కొండారెడ్డి, లక్ష్మినారాయణ, ఏఎన్ఎం అరుణ ఆశాలు పద్మావతి, జ్యోత్స్న పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ పొన్నతోట గంగమ్మకు నివాళి

సింహాద్రిపురం, ఆగస్టు 10: కమ్యూనిస్టు పార్టీ యోధుడు కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి బార్య కామ్రేడ్ పొన్నతోట గంగమ్మ 18వ వర్ధంతిని శనివారం అంకాళమ్మగూడూరులోని పొన్నతోట వెంకటరెడ్డి స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కామ్రేడ్ పొన్నతోటకు గంగమ్మ చేదోడు వాదోడుగా ఉండేదన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ మహిళా ఉద్యమంలో ఆమె చురుకుగా పాల్గొన్నట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్‌రెడ్డి, పొన్నతోట సత్యప్రసాద్‌రెడ్డి, సరళ, శివారెడ్డి, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు ప్రజాదర్బార్ అభినందనీయం

● మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 : కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మంత్రులతో గ్రీవెన్స్ సీఎంచంద్రబాబు ప్రతిరోజూ ఏర్పాటు చేయడం అభినందనీయమని కడప మాజీ డిప్యూటీ మేయరు ఆరిఫుల్లా తెలిపారు. శనివారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బారు కార్యక్రమంలో కార్యకర్తల నుండి ఆయన వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అటు ప్రభుత్వం నడుపుతూ ఇటు ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న చంద్రబాబు కార్యకర్తల సమస్యలు కూడా తీర్చేందుకు ప్రతిరోజూ ఒక్కోమంత్రి ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటుచేసి వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో కార్యకర్తల్లో మనోధైర్యంపెంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'కృతజ్ఞతా యాత్రను విజయవంతం చేయండి'

కడప (మారుతీనగర్), ఆగస్టు 10: కృతజ్ఞతా యాత్రను విజయవంతం చేయాలని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (పేరుపోగు వర్గం) రాష్ట్ర కార్యదర్శి గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ, రాష్ట్ర అధికార ప్రతినిధి టి.హరిబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

నేడు శిల్పారామంలో

చేనేత వస్త్ర ప్రదర్శన - అమ్మకాలు

కడప (కల్చరల్) ఆగస్టు 10: చేనేత వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 11వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి కడప శివారు ప్రాంతంలోని రిమ్స్ సమీపంలో ఉన్న శిల్పారామంలో చేనేత వస్త్రప్రదర్శన-అమ్మకాల కార్యక్రమం జరగనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కలెక్టర్ ఎల్. శివశంకర్ ఆదేశాల మేరకు శిల్పారామంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో పొందూరు, ఖద్దర్ సర్టింగ్స్, పంచలు, బందరుకాటన్, మంగళగిరి చీరలు, మాధవరం చీరలతో పాటు ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి స్వంత మగ్గాలపై తయారుచేసిన చేనేత వస్త్రాల ఉత్పత్తులను 30శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు జరుగనున్నట్లు వెల్లడించారు. కావున ఈ అవకాశాన్ని కడప ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలు సేవించవద్దు: సీఐ



అర్ధరాత్రి తనిఖీ చేస్తున్న సీఐ రామక్రిష్ణారెడ్డి, పోలీసులు

కమలాపురం రూరల్, ఆగస్టు 10: మత్తు పదార్థాలు సేవించవద్దని సీఐ కమలాపురం సీఐ రామక్రిష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం అర్ధరాత్రి నగర పంచాయతీ పరిధిలో ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తుపదార్థాలు సేవించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చర్యలు తప్ప వన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మత్తు పదార్థాలు సేవించినా, గంజాయిలాంటివి వాడుతున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.

పీహెచ్‌సీ వైద్యసేవలను ప్రజలకు వివరించాలి



పరీక్షలు నిర్వహించి సూచనలిస్తున్న డాక్టర్ రేష్మ

పులివెందుల రూరల్, ఆగస్టు 10: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్యసేవలను ప్రజలకు వివరించాలని తొండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రేష్మ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శనివారం తొండూరు పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ అనే కార్యక్రమం ద్వారా డాక్టర్ రేష్మ గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు, మెరుగైన వైద్యసేవలు అందిస్తారని ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే మం దులు, మాత్రలు నాణ్యమైనవని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, హెచ్ఎస్ శశికళ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దశరథ మహారాజ దేవస్థానలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

చక్రాయపేట, ఆగస్టు 10: శ్రావణమాసం సందర్భంగా దేవరగుట్టపల్లె-నాగులగుట్టపల్లె మధ్యలో వెలసిన కౌసల్య, సుమిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజ స్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి శనివారం ఇక్కడ అన్నదానం చేస్తున్నట్లు నిర్వా హకులు తెలిపారు. మేడిశెట్టి చిన్న వెంకటసుబ్బయ్య కుమారులు వెంకటసుబ్బయ్య, చిన్న వెంకటసుబ్బయ్య, రామాంజులు వారి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో దశరథ మహారాజుస్వామి ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

● ఉమా జిల్లా కార్యదర్శి మహబూబ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌ఖాన్

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 : ప్రభుత్వ పాఠశాలలకు సమస్యగా ఉన్న జీఓ 117ను రద్దు చేయాలని యునైటెడ్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహబూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం జీఎం మ్యారేజీ హాలులో గౌరవ అధ్యక్షుడు మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 నుంచి 5 తరగతులను పాత పద్ధతిలో సవరణ చేసి ఖాళీగా ఉన్న ఎస్‌జీటీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 9, 10 తరగతుల ఉర్దూ లాంగ్వేజీ పాత సిలబస్ చెప్పడానికి అనుమతిని ఈ సంవత్సరం పరీక్షలు జరిపి వచ్చే ఏడాది ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా పుస్తకాలు ముద్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సుకుమార్, అల్లాబకాష్, ముబారక్‌అలీ, జిలానీబాషా పాల్గొన్నారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



మంత్రితో మాట్లాడుతున్న వేంపల్లె టీడీపీ నేతలు

వేంపల్లె, ఆగస్టు 10: దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శనివారం వేంపల్లెకు చెందిన టీడీపీ నేతలు కలిశారు. టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి పివి రమణ, దేవస్థాన మాజీఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, మాజీ వార్డు సభ్యులు నల్లగారి రామకృష్ణారెడ్డి, ఎల్‌బీఆర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వేంపల్లెలోని వృషభాచలేశ్వరస్వామి ఆలయ పాలక మండలి గడువు తీరిందని, కొత్త పాలక మండలి ఏర్పాటు చేయాలని కోరగా త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. గండి పాలక మండలిలో ఇంకా వైసీపీ వారే కొనసాగుతున్నారని, రద్దు చేయించాలని కోరగా త్వరలోనే గండికి వస్తానని, ప్రస్తుత పాలక మండలిని రద్దుపరిచి నూతన నోటిఫికేషన్ విడుదల చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు అన్యాయం చేస్తున్న ఆర్జీయూకేటీ

● హోం మంత్రి అనితకు అధ్యాపకుల వినతి



హోం మంత్రికి వినతిపత్రం
అందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు

వేంపల్లె, ఆగస్టు 10: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఆర్జీయూకేటీ యూనివర్సిటీ అన్యాయం చేస్తోందని హోం మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్జీయూకేటీ కాంట్రాక్టు అధ్యాపకుల అసోషియేషన్ అధ్యక్షుడు నజీర్ శనివారం విజయవాడలో హోంమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ఉద్యోగంలో చేరినందున కక్షసాధింపుగా వ్యవహరిస్తున్నారన్నారు. 2018 నోటిఫికేషన్ ద్వారా చేరామని, ఇప్పటి వరకు పలు మార్లు తొలగించారన్నారు. కోర్టు జోక్యంతో విధుల్లోకి తీసుకున్నట్లు తెలిపారు. రూ.25వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారని మంత్రికి తెలిపారు. మా తర్వాత చేరిన అధ్యాపకులకు కూడా సముచిత వేతనాలు ఇస్తున్నారని, మాకు మాత్రం అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంలోనైనా 2018 నుంచి పనిచేస్తున్న కాంటాక్టు అధ్యాపకులకు మిగతా అధ్యాపకుల మాదిరి సౌకర్యాలు కల్పించాని కోరగా సానుకూలంగా స్పందించినట్లు నజీర్ తెలిపారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగం: డీహెచ్‌పీఎస్

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 10 :రాజదండం స్థానంలో రాజ్యాంగం అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కె.మునెయ్య, జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం హోచిమన్ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 13న విజయవాడ గవర్నరుపేట ప్రెస్‌క్లబ్‌లో డీహెపీఎస్ రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. ఇందులో భారత పార్లమెంటులో రాజదండం స్థానంలో భారత రాజ్యాంగం ప్రతిష్ఠించాలని ప్రధాన డిమాండుతో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు

పులివెందుల రూరల్, ఆగస్టు 10: దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. శనివారం మండలంలోని మోట్నూతలపల్లెలో ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల వలన డెంగ్యూ, చికున్‌గునియా, బోదకాలు,మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమలు పుట్టకుండా చూసుకోవాలని సలహాలు, సూచనలు చేశారు. డ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. లార్వా ఉన్ననీటితొట్లు, మురుగుకాల్వల్లో అబేట్ పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శైలాబి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న జిల్లా ఆసుపత్రి

- 350 పడకల ఆసుపత్రిలో బ్లీచింగ్, ఫినాయిల్, యాసిడ్ లేని దుస్థితి
- వార్డుల్లో ఊడ్చటానికి చీపుర్లు, చాటలు లేని వైనం
- డస్ట్ బిన్స్, బయోప్లాస్టిక్ కవర్లు నిల్
- పాచిపట్టిన వాటర్‌ట్యాంకులు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన ఆసుపత్రి
- 42 మంది సెక్యూరిటీ గార్డులున్నా పర్యవేక్షణ నిల్
- ఐదు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వని దుస్థితి
- కాంట్రాక్టర్ తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 10 : పేదలకు ఉచితం గా వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన వైద్యం కలగానే వుంటున్నది. ఏ ప్రభుత్వం వచ్చినా ఆసుపత్రుల్లో మార్పు కానరావడంలేదు. అందుకే ఇప్పటికీ పేదలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలంటే జంకుతారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులు అపరిశుభ్రతకు నిలయంగా వుండటం వలన వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ బాధ్యతగా లేకపోవడం వలన అక్కడికి వెళ్ళి వైద్య సేవలతో పాటు ఆసుపత్రిలో అడ్మిట్ కావాలంటే భయపడతారు. వివిధ రకాల ఫీజులు భరించలేని పేదలు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. అయితే ప్రభుత్వాలు ఆసుపత్రుల్లో వైద్యసేవలతో పాటు అన్ని రకాల వసతులు మెరుగు పరచడంతో ఇంకా వివక్షత పాటిస్తూనే వున్నాయి, ఆరోగ్య శ్రీ పథకం పెట్టి ఓపీ సేవలతో పాటు వెయ్యి రకాల జబ్బులకు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చని ప్రభుత్వమే ప్రోత్సహిస్తావుంటే ఇక ప్రభుత్వ ఆసుపత్రి గడప తొక్కేవారుంటారా. ఆరోగ్య శ్రీ సేవలను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెట్టినప్పటికి ఇక్కడ స్పెషలిస్టు డాక్టర్లు వుండరు.దీంతో పేదలు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులకు తప్పక వెళ్ళ వలసిన పరిస్థితులు వుంటు న్నాయి. ప్రభుత్వ ఆసుత్రుల్లో కనీసం ఎండీ జనరల్ ఫిజీషిన్లు, ఎంఎస్ సర్జన్ డాక్టర్లు వుండటం లేదు. దీంతో పేరుకు 350 పడకలు గల జిల్లా ఆసుపత్రి. కానీ ఇక్కడ అలాంటి సేవలు అందుబాటులో లేవు. అంతేకాకుండా ఇక్కడ పారిశుధ్య సేవలు సైతం దుర్భరంగా వుండటం తో ఆసుపత్రిలో వార్డులు, టాయ్‌లెట్‌లు కంపు కొడుతున్నాయి.







కింద పెట్టిన ఏసీలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ట్యాంకులు శుభ్రం చేయక పాచిపట్టిన నీళ్లు

ఆరోగ్య మంత్రి సొంత ఊరులో కంపు కొడుతున్న జిల్లా ఆసుపత్రి..: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సొంత ఊరైన ప్రొద్దుటూరులో జిల్లా ఆసుపత్రి కంపు కొడుతోంది. జిల్లా ఆసుపత్రికి శానిటేషన్ కాంట్రాక్టర్ నిర్వహణ తీరు సక్రమంగా లేకపోవడం వలన కనీసం వార్డులు,టాయ్‌లెట్లు శుభ్రం చేయడానికి బ్లీచింగ్ గానీ ఫినాయిల్ ,యాసిడ్ గానీ లేని దుస్థితి నెలకొంది. పదిరోజులుగా ఈ దుస్థితి వుననట్లు కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్ళినా అతను స్పందించటం లేదని స్వయంగా సూపరింటెండెంట్ ఆనంద్ బాబు వెల్లడించడం గమనార్హం. కాగా వార్డుల్లో చెత్త ఊడ్చటానికి చీపుర్లు లేవని అరిగిపోయిన పుల్లలతో ఊడ్చుతున్నామని పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. అంతేగాక చెత్తను ఎత్తటానికి చాటలు కూడా లేవని వాపోతున్నారు. ఫినాయిల్‌తో క్లీనింగ్‌చేయడానికి మాప్ స్టిక్‌లు కూడా లేవంటున్నారు.

డస్ట్ బిన్స్, బయో ప్లాస్టిక్ కవర్లు నిల్ : ఆసుపత్రిలో పోగయ్యే చెత్తను డస్ట్‌బిన్స్‌లో వేస్తామంటే తగినన్ని డస్ట్‌బిన్స్ లేని పరిస్థితి వుంటున్నది.డస్ట్ బిన్స్‌కుతగిలించే బయోప్లాస్టిక్ కవర్లు కూడా లేని దుస్థితి వుందని స్వయంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ వెల్లడిస్తున్నారు.

పాచిపట్టిన వాటర్‌ట్యాంకులు..: 350 పడకల ఆసుపత్రిలో నీళ్ళటాంకులు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టి వున్నాయి. కొన్ని టాంకులకు మూతలు కూడాలేవు.

ఏఆర్‌టీ సెంటర్ మెట్లపై వాడి పడేసిన నిరోధ్‌లు : జిల్లా ఆసుపత్రిలో 42 మంది సెక్యూరిటీ గార్డులు వున్నప్పటికీ ఆసుపత్రిలో బయటి వ్యక్తులు వచ్చి అసాంఘిక కార్యకలాపాలు జరుపుతున్నట్లు చెబుతున్నారు. కొందరు ఆసుపత్రిలోనే ఇలాంటి తప్పుడు పనులు చేస్తూ వాడిన నిరోధ్ లు అక్కడే వేస్తున్నా అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోవడంలేదు.

ఐదు నెలలుగా పారిశుధ్యకార్మికులకు జీతాల్లేవు..: గత ఐదునెలలుగా పారిశుధ్యకార్మికులకు కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వలేదు. అంతేకాకండా వీరికి ఎవ్వరికీ ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కానీ కల్పించటం లేదని కార్మికులు వాపోతున్నారు.

పొంగిపొరుతున్న మలం బ్లాకులు..: జిల్లా ఆసుపత్రిలో మలం బ్లాకులు నిండిపోయి పొంగి పొరుతున్నాయి.దీంతో ఓపీ దగ్గరే దుర్వాసన వెదజల్లుతోంది. ఈ పనులు చేయవలసిన పారిశుధ్య కార్మికులు కొందరు పోస్టుమార్టం గది వద్ద ఇతర వార్డులలో అనధికారికంగా పనిచేసుకుంటూ ఆదాయ మార్గాలు చూసుకుంటున్నారు.దీంతో మలం బ్లాకులు పొంగి పొరుతున్న వాటిని సకాలంలో క్లీనింగ్ చేయించాల్సిన పారిశుధ్య కాంట్రాక్టర్ గానీ సూపర్‌వైజర్ పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాంట్రాక్టర్ నా ఫోన్‌ను కూడా లిఫ్ట్ చేయడు



ఆసుపత్రిలో క్లీనింగ్ మెటీరియల్ లేక వారం పదిరోజులుగా ఇబ్బందులు పడుతున్నాం. టాయ్‌లెట్లు దుర్వాసన కొడుతున్న మాట వాస్తవమే. కాంట్రాక్టరుకు ఫోన్ చేస్తే కనీసం లిఫ్ట్ చేయడు.వర్కర్లకు ఐదు నెలలుగా జీతాలు కూడా రాకపోవడంతో పనిపట్ల శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ పర్యవేక్షణలో నిర్లక్ష్యంపై విచారించి చర్యలు తీసుకుంటాం. అసాంఘిక కార్యకలాపాలు మా దృష్టికి రాలేదు. అటువంటి చర్యలను ఉపేక్షించం.

ఆనంద్, జిల్లాఆసుపత్రి సూపరింటెండెంట్ ,ప్రొద్దుటూరు

ఉత్తమ ఆలోచనలు మంచి జీవితాన్ని ఇస్తాయి

డీఎస్పీ హుస్సేన్ పీరా



మాట్లాడుతున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

జమ్మలమడుగు, ఆగస్టు 10: ఉత్తమ ఆలోచనలు మంచి జీవితాన్ని ప్రసాదిస్తాయని జమ్మలమడుగు డీఎస్పీ హుస్సేన్‌పీరా సూచించారు. శనివారం జమ్మలమడుగులోని సాయిశివానీ కల్యాణ మండపంలో శ్రీ శిరిడీసాయి జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎన్.హైమావతి, ప్రిన్సిపాల్ కర్రు సంజీవరెడ్డి, అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ విద్య ఒక్కటే జీవితాన్ని ముందుకు ఉన్నత స్థాయికి తీసుకెళుతుందన్నారు. కరస్పాండెంట్ హైమావతి మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదవాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధ, అర్బన్, రూరల్ సీఐలు కరుణాకర్, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ కల్పన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి



బాధితులను పరామర్శిస్తున్న దృశ్యం

బద్వేలు, ఆగస్టు 10: కొత్తపల్లి రెవెన్యూ పొలంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు, జిల్లా దళిత సంఘం పోరం నాయకుడు కిశోర్, సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి నారాయణ, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు గుర్రప్ప తదితరులు డిమాండ్ చేశారు.శనివారం బద్వేలు మండల పరిధిలోని కొత్తపల్లె రెవెన్యూ పొలంలోని గుడిసెలను పరిశీలించారు. బాధిత మహిళలను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడికి గురైన వారిపైనే పోలీసులు కేసు నమోదు చేయడం అన్యాయమని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న విషయమై రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.ఈకార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపరచిన విద్యార్థులు

జమ్మలమడుగు, ఆగస్టు 10: యోగి వేమన విశ్వ విద్యాలయం విడుదల చేసిన రెండు, 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో యూనివర్సిటీ టాపర్స్‌గా జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచడం పట్ల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆయన మాట్లాడారు. బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ విభాగంలో ఎ.మాధవి 9.67, సి.చందు 9.33, పి.చాందిని 9.33, బి.గౌరీమోహన్ 9.33, కె.సౌజన్య 9.33, ఎన్.ప్రమీళ 9.33, కె.హారిక 9.33, కె.శ్రీనివాసులు 9.0, వై.శివశంకర్‌రెడ్డి 9.0, ఎం.సతీష్ కుమార్‌నాయక్ 9.0, 4వ సెమిస్టర్ ఫలితాల్లో పి.ప్రియాంక 9.13, జి.పవన్ 9.40, జి.విశ్వనాథ్ 8.30, ఎం.పార్థసారధి 8.40, కె.రవికుమార్ 8.13, జి.ఈశ్వర్ 8.8, పి.శివకుమార్ 8.7 పాయింట్లతో ఉత్తమ ప్రతిబ కనపరిచారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, బాబూరావు, వైస్‌ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, విద్యార్థులను అభినందించారు.

'జగన్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తగదు'

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 10: ప్రజాతీర్పును గౌరవించకుండా జగన్‌మోహన్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తగదని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ విమర్శించారు. శనివారం టీడీపీ బీసీసెల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, ఇసుక దోపిడీతో ప్రజలను వైసీపీ నాయకులు పీడించారని విమర్శించారు. జగన్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాజు, తెలుగుయువత నాయకుడు మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరు మండలంలోకి ప్రవేశిస్తున్న కృష్ణా జలాలకు శనివారం హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కలెక్టర్ లోతేటి శివశంకర్

25 నుంచి శానిటేషన్ సిబ్బంది సమ్మె

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 10 : ఈ నెల 25 నుంచి శానిటేషన్ సిబ్బంది సమ్మె చేపడుతున్నట్లు మెడికల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ యూనియన్ నేతలు సి.సుబ్బరాయుడు, రాజమ్మ, ప్రమీళ తెలిపారు. శనివారం వారు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 12 నుంచి దశల వారీగా కార్యక్రమాలు జరిపి 25 నుంచి నిరవధిక సమ్మెను చేయబోతున్నామన్నారు. ఏఐటీయూసీ పట్టణ నాయకులు మధు, గురుమూర్తి, యూనియన్ రాష్ట్ర నాయకులు చెన్నమ్మ, విమల, ప్రభావతి పాల్గొన్నారు.


కుందూకు భారీ వరదనీరు

రాజుపాలెం, ఆగస్టు 10 : ఎగువ ప్రాంతంలో వర్షాలకు తోడు క్రిష్ణాజలాలతో కుందూ పరవళ్లు తొక్కుతోంది. జిల్లా సరిహద్దు నుంచి రాజోలి ఆనకట్ట నుంచి శనివారం 13,308 క్యూసెక్కుల నీరు కుందూలో ప్రవహిస్తోంది. దీంతో కుందూ ఉధృతంగా ప్రవ హిస్తోంది. కుందూ వెంబడి రైతన్నలు వరినాట్లు తదితర వాటిలో నిమగ్నమయ్యారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కుందూ పరివాహక ప్రాంతాలు కేసీ కాల్వ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అట్లూరు, ఆగస్టు 10 : మండలంలోని నల్లగొండుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆ గ్రామ ప్రజలకు విద్యార్థులకు బద్వేలు సివిల్ జడ్జి గాయత్రి ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చట్టాలపై వివరించారు. అలాగే కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కేజీబీవీ స్కూలులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి మాధురి, సీహెచ్‌వో మురళీ, ఉపాధ్యాయులు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు



మైలవరం, ఆగస్టు 10 : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా మండల పరిధిలోని జి.ఉప్పలపాడులోని అభయాంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామునుంచి జిల్లా నుంచే కాక నంద్యాల, అనంతపురం ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అభయాంజనేయున్ని ప్రత్యేకంగా అలంకరించారు.ఆలయ ఆవరణలో భజన, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఆగస్టు 10 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకఅభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం చేశారు.

దశాబ్దకాలం గడిచినా ఇళ్లపట్టాలు ఇవ్వరా

పోరుమామిళ్ల, ఆగస్టు 10 : దశాబ్దకాలం అవుతున్నా తిరుపతిరెడ్డికాలనీవాసులకు ఇళ్లపట్టాలు ఇవ్వరా అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. శనివారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని తిరుపతిరెడ్డి కాలనీలో ఆ కాలనీ పదోవార్షికోత్సవసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ఏర్పాటు చేసుకుని గుడిసెలు, రేకులషెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నా పేదవారికి పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నాగసుబ్బారెడ్డి, రామయ్య, చంద్రశేఖర్, తాలుకా ఇన్‌చార్జ్ వీరశేఖర్, మండల కార్యదర్శి రవికుమార్, పిడుగుమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చర్చి శిలాఫలకం ఆవిష్కరణ



బద్వేలు రూరల్, ఆగస్టు 10 : స్థానిక నెల్లూరురోడ్డులోని ఫాతిమా చర్చి ఆవరణలో పునీత ఫాతిమామాత నూత న దేవాలయ శిలాఫలకాన్ని శనివారం కడప మేత్రాసన పీఠాధిపతులు గాలిబాలి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పునీత దేవాలయాన్ని దాతల సహకారంతో నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

మహిళాసాధికారత సదస్సు..: కడప డయాసిస్ సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్‌బాలరాజు ఆధ్వర్యంలో బిషప్ గాలిబాలి అధ్యక్షతన స్థానిక ఫాతిమా చర్చి ఆవరణలో మహిళా సాధికారత సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బద్వేలు, బి.కోడూరు, పోరుమామిళ్ల నుంచి మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మహిళాసంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతంచేయాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 10 : ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కార్యవర్గసమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకమైన ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర కమిటీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, జిల్లా కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

18న ఆర్యవైశ్య సభ సర్వసభ్య సమావేశం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 10: ఆర్యవైశ్య సభ 134వ వార్షిక సర్వసభ్య సమావేశం 18వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్ రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు అమ్మవారిశాలలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని, 18 సంవత్సరాలు పైబడిన ఆర్యవైశ్యులు అందరు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో 2023-24 సంవత్సర ఆర్యవైశ్య సభ వార్షిక నివేదిక, 2023 సంవత్సరం దసరా ఉత్సవ జమా ఖర్చుల నివేదికలను ఆమోదిస్తామన్నారు. అమ్మవారి బంగారు, వెండి నగలపై ఆడిటర్ నివేదికను ఆమోదించడం, ఆర్యవైశ్య సభ బైలా రెన్యువల్ చేయడంపై చర్చిస్తామని తెలిపారు.

రాజీలేని పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం

బద్వేలు, ఆగస్టు 10: రాజీలేని పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ పతాకాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓబుల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యకమంలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు శివప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్టఫర్ , క్రిష్ణుడు, ట్రెజరర్ రామచ్రందయ్య, అట్లూరు మండల అధ్యక్షుడు కంచిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెన్నయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండు సమీపాన యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నల్లగట్ల నాగార్జునరెడ్డి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ 50 ఏళ్ల యూటీఎఫ్ ప్రస్థానంలో ఉపాధ్యాయులకు ఎనలేని సేవ చేసిందన్నారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవిశంకర్, ఓబులేసు, మహ్మద్‌రఫి, మురళీమోహన్‌రెడ్డి, మల్లికార్జున, శివశంకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ప్రభుత్వం ఏదైనా పాలకులు ఎవరైనా అధ్యయనం, అధ్యాపనం,సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో 1947 ఆగస్టు 10 ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య అన్నారు. శనివారం పోరుమామిళ్లలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఈశ్వర్‌రావు, శ్రీనివాసులు, జాషువా, విజయబాబు, చెన్నక్రిష్ణయ్య, సీఐటీయూ నాయకుడు భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 10: విద్యార్థులు క్రీడానైపుణ్యం పెంచుకోవాలని ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరం పాఠశాలలో సరస్వతి విద్యాపీఠం అనంతపురం సమితి స్థాయి ఖేల్‌హబ్ పోటీలు ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం క్రీడాసాధన చేసి క్రీడల్లో రాణించాలని సూచించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాగా ఈ పోటీలకు రాయలసీమ జోన్‌లోని 42 సరస్వతి విద్యామందిరం పాఠశాలల విద్యార్థులు దాదాపు 800 మంది హాజరయ్యారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు, ఆర్‌టీపీఈ వ్యాయామ కళాశాలల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ రేస్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు నర్సరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప విభాగ్ సరస్వతి విద్యాపీఠం అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, అనంతపురం కార్యదర్శి పరచూరు రమేష్, క్రీడా పోటీల నిర్వాహకులు యల్లారెడ్డి, రామచంద్రయ్య, కేశవరెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.